క్లుప్తంగా

అన్ని వర్గాలకు పథకం వర్తింపజేయాలి

దేవరుప్పుల: బీసీ గ్రూపులోని అన్ని వర్గాలకు కులవృత్తుల పథకం వర్తింపజేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేజర్ వృత్తిదారులైన చేనేత, ముదిరాజ్, గౌడ కులాలను పథకంలో చేర్చి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలన్నారు.

సన్మానం

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూరుకు చెందిన ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత ఈరెంటి విజయ్‌కుమార్‌ను సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. విద్యావంతుల సాహిత్య ఉద్యమం ద్వారా సమాజ హితం కోరే మార్పులు జరుగుతాయని, ఈ దిశలో అన్ని వర్గాలు తమ పరిసరాల అభివృద్ధి కోసం తోడ్పాటు అందించాలని సూచించారు.

నివాళి

రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెంలో పరిశ యాదమ్మ (90) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న డాక్టర్ కల్నల్ మాచర్ల భిక్షపతి ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి మండలగూడెం చేరుకొని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ముదిరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి ఉత్తెపు సత్యనారాయణ, నీల కృష్ణమూర్తి, పిట్టల సిద్దులు, పరిశ రఘుపతి, బోళ్ల కుమార్ ఉన్నారు.

గుండెపోటుతో రజక సంఘం రాష్ట్ర నాయకుడు రవి మృతి


రవి (ఫైల్)

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఆర్‌ఎంపీ వైద్యుడు సాంబరాజు రవి గుండెపోటుతో ఆదివారం అకస్మికంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రవి గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా పని చేయడంతో పాటు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ఒక్క సారిగా గుండె పోటుకు గురికావడంతో చికిత్స నిమిత్తం వెంటనే కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. రవి ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన వెలిశాల యాకయ్య మృతి చెందాడు. కాగా, ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఇల్లందుల సుదర్శన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే కొండాపూర్‌కు చెందిన ఈరగోని సమ్మక్క మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ లోడెం రజితరవీందర్, ఉప సర్పంచ్ కొడ సంపత్, గ్రామ శాఖ అధ్యక్షుడు గాలి ప్రవీన్, కొండ తిరుపతి, కొండ రాజు ఉన్నారు.

ఈదురుగాలుల బీభత్సం


వరికోత మిషన్‌పై పడిన చెట్టు

జఫర్‌గఢ్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వడ్డెగూడెంలో పెద్ద తుమ్మ, వేప చెట్లు విరిగిపడగా బల్లెపు యాదగిరి ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. ఇదే గ్రామానికి చెందిన బొరిగం రాజు వరికోత యంత్రంపై తుమ్మ చెట్లు కూలడంతో యంత్రం దెబ్బతిని తీవ్ర నష్టం జరిగింది. తిమ్మంపేటలో పల్లు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిపడ్డాయి. ఓబులాపూర్‌లో ఓ ఇంటి పైకప్పు రేకులు గాలికి ఎగిరిపోయి లొంక మల్లయ్య ఇంటి వద్ద ఉన్న నాలుగు గేదెలపై పడడంతో అవి గాయపడ్డాయి. కాగా, బాధిత కుటుంబాన్ని సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, సర్పంచ్ గార్లపాటి నీరజారెడ్డి పరామర్శించారు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.

తప్పిన పెనుప్రమాదం

దేవరుప్పుల: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావుకు ఘన స్వాగతం పలికే క్రమంలో గులాబీ యువత బాణాసంచా పేల్చడంతో నిప్పురవ్వలు పక్కనే ఉన్న పేపర్ బ్లోజర్ వాహనంలో పడి మంటల లేచాయి. ఈ మంటలను గమనించిన యువకులు అప్రమత్త చర్యలు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది. లేనట్టయితే అందులో ఉన్న గ్యాస్ సిలిండర్‌లు పేలితే ఊహకందని ప్రమాదం జరిగేదని.. నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

పింఛన్ పెంచడం హర్షణీయం


స్టేషన్‌ఘన్‌పూర్: కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లిలో..

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని, దివ్యాంగులకు పింఛన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచడం సర్వత్రా హర్షణీయమని సర్పంచ్ గోవిందు ఆనందం అన్నారు. దివ్యాంగులకు నెలకు అదనంగా రూ.1,000 పింఛన్ పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని కొత్తపల్లిలో దివ్యాంగుల సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండి రాజు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బెల్లపు వెంకటస్వామి, ఉపసర్పంచ్ ముక్కెర మహేందర్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, జోగు లింగస్వామి, బలుగుల లింగస్వామి, దార అరుణ, గోవిందు లక్ష్మీ, కుమార్ పాల్గొన్నారు.

కేసిరెడ్డిపల్లిలో..

బచ్చన్నపేట: దివ్యాంగులకు పింఛన్‌ను 3,016 నుంచి రూ. 4,016 పెంచినందుకు మండలంలోని కేసిరెడ్డిపల్లిలో దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మల్లవరం వెంకటేశ్వర్లురెడ్డి, ఎంపీటీసీ కర్ణాల వేణుగోపాల్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. అడగకుండానే అన్ని వర్గాల ప్రజలను గుర్తించి వారి అవసరాలకు తగినట్లు వరాలను కురిపిస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు కాపర్తి హరిప్రసాద్, దివ్యాంగుల సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు బైరగోని సంతోష్ కుమార్, వార్డు సభ్యులు రిక్కల ఆగంరెడ్డి, నాయకులు వద్దుల అంబదాస్, గాలి తిరుపతి, సత్యనారాయణరెడ్డి, యాకూబ్, రాజమౌళి, పర్శరాములు, బాపిరాజు, వినోద్, సందీప్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి


నాయకులతో సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులతో ఆమె ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తుందని, ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసుగు చెంది ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, యువత, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, మహిళల సమస్యల కోసం పనిచేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీని గడపకు గడపకు తీసుకెళ్లేలా పార్టీ నాయకులు బాధ్యతగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు త్వరగా ఇవ్వాలి



పాలకుర్తి: కులవృత్తులు, చేతి వృత్తిదారుల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆర్థిక సాయం పథకం దరఖాస్తు చేసుకొనేందుకు మీసేవలో కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్లను త్వరగా ఇవ్వాలని తెలంగాణ వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి మదార్ కోరారు. ఆదివారం పాలకుర్తి మండల కేంద్రంలో వృత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, రజక, కుమ్మరి, మేదరి తదితర కులవృత్తులను నమ్ముకొని జీవిస్తున్న వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం పథకం ప్రవేశ పెట్టిందన్నారు. వివిధ వృత్తులు చేసుకొనే వారు మీసేవలో సర్టిఫికెట్ల కోసం అప్లై చేసుకున్నారని.. వారికి వెంటనే ఇవ్వాలని అన్నారు. ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20 వరకు ఉన్న చివరి గడవును పొడిగించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సాయంలో రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికి అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

క్విజ్ పోటీల్లో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

జనగామ రూరల్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌లో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యువత రాజకీయంగా ఎదగడానికి ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘం చక్కటి వేదిక అన్నారు. రాబోయే ఎన్నికలకు సంఘం క్రియాశీలకంగా ఉండాలని సైనికుని వలె పని చేయాలని సూచించారు. జిల్లా మండల పట్టణ కమిటీల పని తీరును పర్యవేక్షించి సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మిస్బా ఉద్దీన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుట్ల ప్రవీణ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చందర రెడ్డి, నాయకులు తారఖ ఇలాహి, శిరీషరెడ్డి, ప్రభు కిరణ్, బాబా, పవన్, హరగోపాల్, ప్రశాంత్, యాసిన్ పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిన సీపీఐ నాయకులు

జఫర్‌గఢ్: కొత్తగూడెంలో తలపెట్టిన ప్రజా గర్జన బహిరంగ సభకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని అన్నారు. సమ్మయ్య, యాదగిరి, ప్రభాకర్, సతీష్‌కుమార్, చుక్క శోభ, రఫియా ఉన్నారు.

కోలాటంతో మహిళలకు జీవనోపాధి


మాట్లాడుతున్న రవికుమార్

బచ్చన్నపేట: కోలాటం నేర్చుకోవడంతో మహిళలు జీవనోపాధిని పొందవచ్చని ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జాతీయ పురస్కార అవార్డు గ్రహీత చౌదరిపల్లి రవి కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ భాషా సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోలాటం శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. మరుగునపడిపోతున్న మన సంస్కృతి, సాంప్రదాయాలు, కళలను ముందుతరాలకు అందించే బాధ్యత మనపై ఉందన్నారు. అందుకే ఈ కోలాట శిబిరాన్ని తెలంగాణ భాషా సాంస్కృతి, సిద్దిపేట పెరల్స్ ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. పండుగల వద్ద భోనాలతో కోలాటాలను మహిళలు ఆడడానికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలో 100 మంది మహిళలకు కళల పట్ల మెలకువలను నేర్పుతున్నామని, వారు పలు చోట్ల ప్రదర్శనలు ఇచ్చి జీవనోపాధి పొందనున్నట్లు తెలిపారు. శిక్షణ కోరియోగ్రాఫర్ సుంకరి శరత్‌కుమార్, శిక్షకులు ఏదుల మహేశ్వరి, బడికె కవిత, మండల సమన్వయ కర్త జంగిడి సిద్దులు, నాయకులు జూకంటి కిష్టయ్య, ఎనుగుల కనుకయ్య, కళాకారులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాహిత్య దినోత్సవం

పాలకుర్తి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహిత్య దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి జీపీ వద్ద ఆదికవి పాల్కురి సోమనాథుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే బమ్మెరలో పోతన చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ నాగభూషణం పాల్గొన్నారు.

‘ఆత్మీయ’ సేవలు అభినందనీయం


బాడీ ఫ్రీజర్‌ను అందజేస్తున్న జనార్దన్

పాలకుర్తి: గ్రామంలో ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని న్యాయవాది, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యుడు దుస్స జనార్దన్ అన్నారు. మండలంలోని ఈరవెన్నులో ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థకు తన తల్లిదండ్రులు పుల్లమ్మ, నారాయణల జ్ఞాపకార్థం రూ.లక్ష విలువైన బాడీ ఫ్రీజర్ (శవ పేటిక)ను ఆయన ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవగుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. పుట్టిన గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. సంస్థ మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని తన వంతుగా సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు సోమనారాయణ, సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ యాదగిరి, ఉప సర్పంచ్ ఐలయ్య, సంస్థ సభ్యులు బిర్రు సోమేశ్వర్, ముస్కు కేశవరం, అనుములు మహేందర్, ఏదునూరి మదార్, తోడ్సు మల్లేష్, అనంతుల పురుషోత్తం, బిర్రు వెంకటేశ్వర్లు, జక్కుల రాజు, యార రాజు, మాజీ సర్పంచ్ సోమన్న, సింగిరెడ్డి సత్తన్న, గాదరి సోమయ్య, అనంతుల వెంకటేశ్వర్లు, కూస సతీష్, ఉపేందర్ పాల్గొన్నారు.

రూ.6 వేల పింఛన్ సాధనే లక్ష్యం


క్షీరాభిషేకం చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

రఘునాథపల్లి: మంద కృష్ణమాదిగ నేతృత్వంలో దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తామని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తాల్లపల్లి కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో దివ్యాంగులకు రూ.4 వేల ఫించన్ పెంపు నేపథ్యంలో ఆయన వీహెచ్‌పీఎస్ నాయకులతో కలిసి మంద కృష్ణమాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దివ్యాంగులపై ప్రేమతో పింఛన్ పెంచలేదని, మంద కృష్ణమాదిగ పోరాటంతోనే రూ.1,000 పెంచాడన్నారు. రాజకీయ రంగంలో దివ్యాంగులకు రిజర్వేషన్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ జిల్లా కో ఇన్‌చార్జ్ జేరిపోతుల సుధాకర్, నాయకులు తాల్లపల్లి ఎల్లయ్య, ఎంగిలి నాగేష్, గంధమాల రామకృష్ణ, దున్నపోతుల రాజు, ఆరేళ్ల భిక్షపతి, గున్నాల సత్తిరెడ్డి, సిద్దయ్య, పాషా, సత్యపాల్‌రెడ్డి, సత్తమ్మ, సోమలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల పెంపు మందకృష్ణ పోరాట ఫలితమే

లింగాలఘనపురం: వికలాంగుల ఫించన్ మంజూరుతోపాటు నేటి కేసీఆర్ ప్రభుత్వం పెంపుదల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమేనని ఆ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారక విగ్రహం వద్ద మంద కృష్ణమాదిగ చిత్రపటానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. నాయకులు సందనేని ఉపేందర్, సోమరాజు, వెంకటయ్య, సాయిలు గౌడ్, లక్ష్మయ్య, యాదయ్య, ఎల్లయ్య, మల్లయ్య ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఐదు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

కొడకండ్ల: అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు అసెంబ్లీ సీట్లు రజకులకు కేటాయించాలని రజక రిజర్వేషన్ సమితి జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో రజక సమితి జిల్లా అధ్యక్షుడు సాంబరాజు రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా తెలంగాణలో రజక కులస్తులు వెనుకబడినారని, రజకులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే రాజకీయంగా ప్రాతినిధ్యం పెరిగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందనే ఆకాంక్షతో పోరాడుతున్నట్లు చెప్పారు. తమ కులానికి చెందిన వారు అసెంబ్లీలో అడుగు పెడితేనే తమ గొంతుక వినిపించి హక్కులను సాధించుకొనే వీలుంటదని, ఆ దిశగా అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించి ఐదు సీట్లను రజకులకు ఇవ్వాలని ఆయన కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక రాములు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ పురిటిగడ్డ అయిన పాలకుర్తి సీటును అన్ని పార్టీలు రజకులకు కేటాయించాలని.. లేనిపక్షంలో స్వతంత్ర అభ్యర్థిని బరిలో నిలిపి అన్ని కులాల సమీకరణతో విజయం సాధిస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గోపి, సంయుక్త కార్యదర్శి వీరయ్య, యాదగిరి, రాజు, కుమార్, అచ్చయ్య, కృష్ణయ్య, సోమయ్య పాల్గొన్నారు.

తెలంగాణ రన్‌ను జయప్రదం చేయాలి


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు(మంగళవారం) డివిజన్ కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ 2కే రన్‌లో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పోలీసు అధికారులు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నేడు నిర్వహించనున్న తెలంగాణ 2కే రన్‌పై చర్చించారు. సీఐలు రాఘవేందర్, సంతోష్, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, రఘుపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

జఫర్‌గఢ్: మండలంలోని తీగారం, తిమ్మాపూర్ గ్రామాల్లో మృతి చెందిన ముసుకు వైష్ణవి, అర్‌ఎంపీ వైద్యుడు సాంబరాజు రవి కుటుంబాలను ఎమ్మెల్యే ఆదివారం రాత్రి పరామర్శించారు.

2కే రన్‌ను విజయవంతం చేయండి

జనగామ రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 2కే రన్‌ను విజయవంతం చేయాలని జనగామ సీఐ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 6 గంటలకు జనగామ రైల్వేస్టేషన్ నుంచి బతుకమ్మ కుంట వరకు రన్ ఉంటుందని పేర్కొన్నారు.

గ్రూప్–1 ప్రిలిమినరీ ప్రశాంతం


సెయింట్ పాల్స్ హైస్కూల్ సెంటర్ వద్ద డీసీపీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ, సీఐ, ఎస్సైలు


సీజేఐటీ వద్ద ఎస్సై సృజన్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

జనగామ: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతగా జరిగింది. ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్లను ఏర్పాటు చేసి పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. పరీక్ష జరుగుతున్న తీరును సంబంధిత అధికారులు తెలుసుకున్నారు.


8 నిమిషాలు ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించాలని కోరుతున్న అభ్యర్థి (టీచర్)

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

జనగామ: జీవితంలో అస్తులు, అతంస్తులు తరిగిన.. చదువు ఒక్కటే జీవితంలో నిలబెడుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సేవెల్లి సంపత్, జిల్లా అధ్యక్షుడు కంచె రాములు అన్నారు. కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు బాల్దె మల్లేశం అధ్యక్షతన ఓ కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఉత్తమ విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి తరం విద్యార్థులు సాంకేతికతను సద్వినియగం చేసుకుని, మంచిమార్గంలో ముందుకు వెళ్తూ రాణించాలన్నారు. అన్నిరంగాల్లో కురుమ విద్యార్థులు మరింత రాణించాలనే సంకల్పం, ప్రోత్సాహం కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్‌లో జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధించిన 150 మందికి పైగా విద్యార్థులకు జ్ఞాపికలు, మెమొంటోలు, మెడల్స్‌తో సత్కరించారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణులు శివకుమార్ పిల్లల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జూకంటి శ్రీశైలం, కోశాధికారి కేమిడి ఉపేందర్, గౌరవ అధ్యక్షులు మోటె దేవేందర్, కోపా గౌరవాధ్యక్షులు బాలీదే సోమయ్య, అధ్యక్షుడు కర్రే కృష్ణ, కోశాధికారి ఎండ్రు వైకుంఠం, సైంటిస్టు కర్రె మల్లేశం, ప్రముఖ వ్యాపారవేత్త కడకంచి శ్రీనివాస్, కౌన్సిలర్లు మంత్రి సుమలత శ్రీశైలం, పేర్ని స్వరూప ఆంజనేయులు, జూకంటి లక్ష్మీ శ్రీశైలం, బాల్దె కమలమ్మ, మార్కెట్ డైరెక్టర్ సేవెల్లి మధు, ఎంపీటీసీ ఉషా రవి, కురుమ సంఘం మండల అధ్యక్షు బండ చంద్రమౌళి, జూకంటి కిష్టయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో పయనించాలి

బచ్చన్నపేట: నేటి యువత సన్మార్గంలో పయనిస్తూ పది మందికి ఆదర్శంగా నిలువాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. చాలా మంది చెడు వ్యసనాలకు అలవాటు పడుతూ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదివి కన్నవారి పేరును నిలబెట్టాలన్నారు. వాహనదారులు హెల్మెట్‌ను తప్పకుండా వినియోగించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ ఐదే రాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

పాలకుర్తి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల్లో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆదివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జెడ్పీటీసీ సభ్యుడు పుస్కూరి శ్రీనివాస్‌రావు పలు గ్రామాల్లో పర్యటించారు. మదార్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిబంధనలు వ్యతిరేకిస్తే చర్యలు


మాట్లాడుతున్న లింగాజీ

స్టేషన్‌ఘన్‌పూర్: పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తే ఎంతటివారికైనా క్రమశిక్షణ చర్యలు తప్పవని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిల్పూరు మండలం వెంకటాద్రిపేటలో శనివారం చేసిన పార్టీ మండల నూతన కార్యవర్గ నియామకం పార్టీ నిబంధనలకు విరుద్ధమన్నారు. నూతన మండల కమిటీల ఎన్నిక కోసం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్, పీసీసీ ఉపాధ్యక్షుడు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, పార్టీ జిల్లా అధ్యక్షుడికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర కమిటీ పరిశీలించి ఎంపిక చేసి జిల్లా కమిటీకి సూచిస్తారని, వారి ఆదేశానుసారం మండల కమిటీలను ఎంపిక చేస్తారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి చింత ఎల్లయ్య, ఘన్‌పూర్ మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, బ్లాక్ అధ్యక్షుడు గాద రమేష్ తదితరులు ఉన్నారు.